నమస్తే తెలంగాణ | శుక్రవారం 20 జూన్ 2025
FRIDAY, JUNE 20, 2025

## బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన



అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 19 : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రూ. 2కోట్ల 20లక్షలతో బాటసింగారం నుంచి కొత్తగూడెం వరకు బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాజీ ఎంపీటీసీ కేశెట్టి వెంకటేష్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల విన్నపంతో నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్‌చారి, మాజీ జడ్పీటీసీ బింగిదాస్‌గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా, మాజీ సర్పంచ్‌లు రాధమ్మ, ఊషయ్యగౌడ్, మాజీ వార్డు సభ్యుడు మారుతీప్రసాద్, నాయకులు ప్రభాకర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గౌరీశంకర్, శివశంకర్‌గౌడ్, జంగారెడ్డి, రాముయాదవ్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రం పురోగతి

షాద్‌నగర్‌రూరల్, జూన్ 19: గ్రామాల అభివృద్ధితో రాష్ట్రం మరింత పురోగతి సాధిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని నాగులపల్లి, రాసుమల్లగూడెం గ్రామాల్లో రూ.75లక్షలతో సీసీ రోడ్డు పనులు, నాగులపల్లిలో రూ.5లక్షలతో అంతర్గత మురుగుకాల్వల నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాసుమల్లగూడెంలో సీసీ రోడ్డు పనులకు రూ.45లక్షలు, నాగులపల్లిలో సీసీరోడ్డు పనులకు రూ.35లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాసుమల్లగూడెంలో ఏర్పాటు చేసిన రేషన్‌షాపును ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, అశోక్, శివరాములు, రాజేష్‌రెడ్డి, వెంకటయ్య, రాఘవేందర్, ప్రవీణ్, రవి, రవీందర్, శ్రీను, నరేందర్, వెంకటేశ్, మల్లేశ్, జితేందర్, మహేందర్, నవీన్, రాములగౌడ్, పాండు, నర్సింహ, స్వామి, సంపత్‌కుమార్, ఆంజనేయులు, శివకుమార్, నందగోపాల్, దాస్ గణేష్, రామకృష్ణ పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి**
**జిల్లా రెవెన్యూ అధికారిణి సంగీత**

ఆదిబట్ల, జూన్ 19: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యం, ఆయిష్ శాఖల సమన్వయంతో యోగా దినోత్సవం అవగాహన పోస్టర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యానికి యోగాభ్యాసం సులువైన సాధనమని, యోగాతో ప్రశాంతత, విశ్రాంతి లభించడమే కాకుండా మానసిక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. జూన్ 21న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో యోగాపై అవగాహన, ఆసనాలు ప్రదర్శించబడతాయని తెలిపారు. నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో భారీ ఎత్తున యోగా దినోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వోలు, ప్రోగ్రాం అధికారులు, ఆయుష్ వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తదితరులు

## హామీల అమల్లో సర్కార్ విఫలం



కేశంపేట, జూన్ 19 : కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీల అమలను ఎందుకు అమలు చేయలేకపోతున్నదని వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలోని గ్రంథాలయం ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో జంగయ్య పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో మహిళల ఖాతాల్లో ప్రతినెలా రూ.2500 జమ చేస్తామని చెప్పారని, ఇప్పటివరకూ ఎందుకు అమలు చేయడం లేదన్నారు. ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేక సర్కార్ విఫలమైందన్నారు. వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలను మోదీ ప్రభుత్వం విస్మరిస్తుందన్నారు. ఇప్పటి వరకు ఉపాధిహామీ పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో కూలీ పనులు చేసిన నిరుపేద ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే మోదీ ప్రభుత్వం స్పందించి ఉపాధిహామీ బిల్లులు విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం కేశంపేట మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లాలయ్య, ఉపాధ్యక్షులుగా జయమ్మ చెన్నయ్య, కార్యదర్శులుగా మల్లేశ్, శంకర్, కోశాధికారిగా లక్ష్మమ్మతో పాటు 7మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

**విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేశ్**



ఉపాధ్యాయులతో సమావేశమైన రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేశ్

కడ్తాల్, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో బోధిస్తున్న విద్య, వసతులు, విద్యార్థుల సమగ్రాభివృద్ధి, బడిబాట తదితర కార్యక్రమాలపై ఉపాధ్యాయులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అరుణ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు పాఠశాల సమయానికి బస్సు సౌకర్యం ఉండాలని, లేని విద్యార్థుకు ప్రత్యేక వాహన సదుపాయం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ విద్యారంగానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో పాఠశాలలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణ, నాయకులు అసిఫ్‌అలీ, సుధాకర్‌గౌడ్, సత్యం, విజయ్‌నాయక్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామానికీ ఆర్టీసీ బస్సు



కడ్తాల్, జూన్ 19: నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణం నుంచి తలకొండపల్లి మండలంలోని గట్టుఇప్పలపల్లి, రాంపూర్ గ్రామాల మీదుగా తలకొండపల్లి మండల కేంద్రం వరకు, నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును గురువారం స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గమ్యస్థానాలకు చేర్చాలని తెలిపారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, ప్రభాకర్‌రెడ్డి, రేణురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, యాదగిరి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

కేశంపేట, జూన్ 19 : మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను ఏవో శిరీష గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లోని స్టాక్ పట్టికను పరిశీలించి మాట్లాడారు. దుకాణదారులు తప్పనిసరిగా స్టాక్, ధరల పట్టికను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని, కల్తీ విత్తనాలు, ఎరువులు ఏమైనా లభ్యమైతే క్రిమినల్ కేసులు నమోదవుతాయన్నారు. ఎమ్మార్పీ ధరకంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

## బీసీ సేన మహిళా కమిటీ ఎన్నిక

కొందుర్గు, జూన్ 19: మండల పరిధిలోని లాలాపేట గ్రామంలో బీసీ సేన మహిళా కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా మంజుల, ఉపాధ్యక్షురాలిగా సత్యమ్మ, ప్రధానకార్యదర్శిగా సునీత, కార్యదర్శిగా మౌనిక, కోశాధికారిగా మంజుల, ప్రచార కార్యదర్శిగా బాలమణి, కార్యదర్శిగా వాణిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు అనితాశేఖర్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా నాయకులు వెంకటేశ్‌ముదిరాజ్, వరలక్ష్మి, సౌజన్య, నర్సింహులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

ఆమనగల్లు, జూన్ 19: ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన నారామోని మల్లేశ్‌యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆమనగల్లు శ్రీ కృష్ణ యాదవ సంఘం సభ్యులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఒక లక్ష ఐదు వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గిరియాదవ్, నాయకులు శ్రీశైలంయాదవ్, గిరియాదవ్ ఉన్నారు.

## అదృశ్యమైన యువకుడి ఆచూకీ లభ్యం

కేశంపేట, జూన్ 19 : అదృశ్యమైన యువకుడి ఆచూకీని కేశంపేట పోలీసులు కనుగొన్నారు. కేశంపేట ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన శివ(32) ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 12న ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు కేశంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా అతడి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు జడ్చర్ల, కర్నూల్ వైపు వెళుతున్నట్లు గుర్తించారు. కర్నూల్‌లో రైలు అరగంట ఆలస్యం కావడంతో రైల్వేస్టేషన్‌లో శివను అదుపులోకి తీసుకొని కేశంపేటకు తీసుకొచ్చారు.

## పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు

చేవెళ్ల రూరల్, జూన్ 19 : శంకర్‌పల్లి మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపాలిటీలో రూ.14 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంకర్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి ఒక కార్యాచరణ రూపొందించి దశలవారీగా అభివృద్ధికి బాటలు వేస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనలో రాజీ లేకుండా ముందుకు సాగుతున్నామన్నారు. శంకర్‌పల్లిలో ముమ్మందు మరిన్ని కార్యక్రమాలు చేపట్టి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

మొయినాబాద్, జూన్ 19 : విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని ఆల్టెయిర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అకాడమిక్ ఇన్నియేటివ్ విభాగ అధిపతి రమేశ్ అన్నారు. కేజిరెడ్డి ఇంజినీరింగ్ కళా శాలలో గురువారం సే ఇండియా క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల బృందం తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



మొయినాబాద్ లోని సురంగల్ లో రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

షాబాద్, జూన్ 19: భూ భారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ స్టేడియంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. భూ భారతి చట్టంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారం కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏండీ అన్వర్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

**మొయినాబాద్ :** భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతుల దరఖాస్తులను అధికారులు తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మొయినాబాద్ మండల మున్సిపాలిటీలోని అజీజ్‌నగర్ గ్రామంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో, సురంగల్ గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులు, భూ పట్టదారులు సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు పెట్టుకున్నారు. భూమి విరాసతు, భూమి సర్వే నంబర్ మిస్సింగ్ తదితర వాటికోసం దరఖాస్తులు పెట్టుకున్నారు. అజీనగర్‌లో లావానిపట్టా ఇతరుల చేతుల్లో ఉన్నాయని రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు రాజేశ్, రోజా, సిబ్బంది సురేందర్, మహేందర్, భరత్, లలిత, రజిత, ఎల్లయ్య, హరీశ్, మహేశ్, బాలకృష పాల్గొన్నారు.

**సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి**

కేశంపేట : రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కేశంపేట తహసీల్దార్ ఆజంఅలీ అన్నారు. మండల పరిధిలోని సంగెం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులతో తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. సంగెం గ్రామంలో 21, పాపిరెడ్డిగూడలో 13దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గీత, ఆర్ఐలు చెన్నకేశవులు, నివేధిత, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్ఐ చెన్నకేశవులు, కృష్ణారెడ్డి, చిన్నారెడ్డి, శంకర్, ప్రభాకర్, నరేందర్ పాల్గొన్నారు.

## పాల సేకరణలో నాణ్యత పాటించాలి

**టీజీడీడీసీఎఫ్ రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోలర్ కవిత**



మాట్లాడుతున్న టీజీడీడీసీఎఫ్ రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోలర్ కవిత

కడ్తాల్, జూన్ 19 : పాల సేకరణలో పాల సొసైటీ సభ్యులు నాణ్యత పాటించాలని టీజీడీడీసీఎఫ్ రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోలర్ కవిత అన్నా రు. గురువారం మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రంలో గల సమావేశ మందిరంలో వివిధ గ్రామాలకు చెందిన పాల సేకరణదారుల తో నాణ్యమైన పాల సేకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా కవితతో పాటు జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ బాబుబేరి, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మోహన్‌మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రంలో రైతుల నుంచి నాణ్యమైన పాలను మాత్రమే సేకరించాలని, పాల నాణ్యతలో రాజీ పడొద్దని.. అప్పుడే వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించగలుగుతామన్నారు. కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో నిత్యం దాదాపు 30 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతున్నా.. పాలు నాణ్యతగా ఉండడం లేదన్నారు. అనం తరం బాబు బేరి మాట్లాడుతూ.. పశువులకు అందించే పోషకారం, పశుపోషణ, పాల నాణ్యతకు సంబంధించిన అంశాలపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం మోహన్‌మురళి మాట్లాడుతూ .. పాల సేకరణ, నాణ్యత, నిల్వ, రవాణా పలు విషయాలను పాల సేకరణదారులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో పాలశీతలీకరణ కేంద్రం ఇన్‌చార్జి మేనేజర్ ఉదయశ్రీ, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మండల పశువైద్యాధికారి భానూనాయక్, వివిధ గ్రామాల పాల సొసైటీ అధ్యక్షులు, పెయిడ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## జీవాల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

షాబాద్, జూన్ 19: జీవాల ఆరోగ్యం పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాంసింగ్‌తండా, హైతాబాద్ తండాల్లో గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది గోపి, విద్యాసాగర్, రైతులు తదితరులున్నారు.



గొర్రెలకు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

## యువకుడి ఆత్మహత్య

**సహజీవనం చేస్తున్న ట్రాన్స్‌జెండర్ వేరే వారితో ఫోన్‌లో మాట్లాడుతున్నదన్న అనుమానంతో..**

పెద్దఅంబర్‌పేట, జూన్ 19 : సహజీవనం చేస్తున్న ట్రాన్స్‌జెండర్ ఫోన్‌లో వేరొకరితో మాట్లాడుతున్నదనే అనుమానంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలోని గుబ్బలవారిపాలెనికి చెందిన నామాల చెన్నకేశవ (21) ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. చెన్నకేశవకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ఉంటున్న ట్రాన్స్‌జెండర్ రోకలి వైష్ణవి అలియాస్ దుర్గాప్రసాద్‌తో పరిచయం ఉన్నది. మూడు నెలల కిందట చెన్నకేశవ జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి వచ్చేశాడు. అప్పటి నుంచి ఇద్దరు కలిసి సహజీవనం చేస్తున్నారు. వైష్ణవి ఫోన్‌లో వేరే వారితో మాట్లాడుతున్నదని చెన్నకేశవ అనుమానం పెంచుకున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే బుధవారం ఫోన్ విషయంలో ఇద్దరు గొడవపడ్డారు. ఆ తర్వాత చెన్నకేశవ గదిలోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్ని రోజుల కిందటే చెన్నకేశవ కుటుంబీకులు వచ్చి.. అతడ్ని ఇంటికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ, అందుకు చెన్నకేశవ అంగీకరించలేదు. చెన్నకేశవ ఆత్మహత్యకు పాల్పడినట్టు ట్రాన్స్‌జెండర్‌రే చెన్నకేశవ తల్లికి, సోదరుడికి ఫోన్ చేసి చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. గురువారం చెన్నకేశవ సోదరుడు నాగ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సోలార్ గ్రిడ్ వ్యవస్థ ఎంతో ఉపయోగం

షాబాద్, జూన్ 19: సోలార్ గ్రిడ్ వ్యవస్థ ఏర్పాటుతో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అమెజాన్ సంస్థ ప్రతినిధి తాతాజీ, పర్యావరణ వేత్త దాతృత్వవాది లిబికోహెన్ అన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ ప్రతినిధులు సోలార్ గ్రిడ్ వ్యవస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి తాతాజీ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి సోలార్ గ్రిడ్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, సంస్థ ప్రతినిధులు రాజేశ్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

## పొంచివున్న ప్రమాదం..

ఆదిబట్ల, జూన్ 19 : విరిగి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతనంగా ఏర్పాటు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నం విద్యుత్ ఏడీ సీతారాంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ కోశాధికారి మహేందర్ మాట్లాడుతూ ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగర కలాన్ గ్రామం నుంచి ఫాక్స్‌కాన్ కంపెనీకి వెళ్లేదారిలో విద్యుత్ స్తంభం కింది భాగంలో విరిగిపోయి ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రాంతం నుంచి ఫాక్స్‌కాన్ కంపెనీలో పనిచేసే ఉద్యోగులు, సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగస్తులు, వాహనదారులు ఈ రోడ్డు గుండా వెళుతుంటారని, ఎలాంటి ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు స్పందించి విరిగిన కరెంటు స్తంభాన్ని తొలగించి అక్కడ నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు కరుణాకర్, భాస్కర్ పాల్గొన్నారు.



విరిగిపోయిన విద్యుత్ స్తంభం

## పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

**మండల విద్యాధికారి మల్లయ్య**



మొయినాబాద్, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల విద్యాధికారి మల్లయ్య కోరారు. మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ చైర్మన్ వాసుదేవ్, ఫౌండర్ సభ్యులు శేషగిరిరావు నోట్ పుస్తకాలు, పలకలు, రూ.40వేల విలువ చేసే స్టేషనరీ సామగ్రిని పాఠశాలల్లోని 250 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోసఫ్‌రెడ్డి, కనకమామిడి కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హమీద్, అజీజ్‌నగర్ కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




చిన్నారులకు దుస్తులు, పలకలను అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ లచ్చిరాంనాయక్

## విద్యార్థులకు దుస్తుల పంపిణీ

కడ్తాల్, జూన్ 19: మండల పరిధిలోని వాసుదేవ్‌పూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు టీచర్లతో కలిసి బీఆర్ఎస్ నాయకుడు, కర్కల్‌పహాడ్ మాజీ ఎంపీటీసీ లచ్చిరాంనాయక్ దుస్తులు, పలకలను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కమల, నాయకులు నర్సింహ, పత్యానాయక్, సుమన్‌నాయక్, శ్రీనూనాయక్, కిషన్‌నాయక్, చంద్రూనాయక్, నరేశ్‌నాయక్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం



ఆదిబట్ల, జూన్ 19: విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వ పాఠశాలలు బాసటగా నిలిచాయని ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేష్ అన్నారు. గురువారం పాఠశాలలో బడిబాట ముగింపు రోజు సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు ఆదిబట్ల బడిబాట చాంపియన్ కిరీటాలు అందించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం బోధించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, భాషయ్య, ట్రైనీ టీచర్ శ్రీజ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఆమనగల్లు, జూన్ 19: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు అన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆమనగల్లు పట్టణంలో పలు చోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటడం ద్వారా కాలుష్య నివారణకు కృషి చేయొచ్చన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ శ్రేణులు అర్జున్‌రావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, నాయకులు పరమేష్, శ్రీనూనాయక్, పంతూనాయక్, వెంకటయ్య, వెంకటేష్, వెంకటయ్య, కేశవులు, జంగయ్య, శ్రీనివాస్, శేఖర్, శంకరయ్య, రైజల్, శేఖర్, రంగయ్య, వెంకటయ్య, సత్యం, లక్ష్మణ్, శంకర్, పాందునాయక్, యాదయ్య, మహేశ్‌నేత, గణేశ్‌నాయక్, యాదగిరి పాల్గొన్నారు.



బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మొక్క నాటుతున్న పార్టీ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు

## రైతు సేవా సహకార సంఘం సందర్శన

తుర్కయాంజాల్, జూన్ 19: సహకార శిక్షణలో భాగంగా రాష్ట్రంలోని సహకార సంఘాల సెక్రటరీలు గురువారం మున్సిపాలిటీ పరిధిలోని తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాల గురించి సంఘం చైర్మన్, డీసీసీబీ చైర్మన్ సత్తయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో కొహెడలోని గోదాములు పరిశీలించారు. కార్యక్రమంలో సీటీఐ ఫ్యాకల్టీ ఈశ్వర్‌రావు, సంఘం సెక్రటరీ రాందాస్ పాల్గొన్నారు.

## రెండు వాహనాలు ఢీ..

కొందుర్గు, జూన్ 19: ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన దశరథ్ బొలెరో వాహనంతో పరిగివైపు వెళుతున్నాడు. కొందుర్గు మండల పరిధిలోని శ్రీరంగాపూర్ చౌరస్తాకు రాగానే వాహనాన్ని నిలిపి టిఫిన్ చేసేందుకు హోటల్లోకి వెళ్లాడు. షాద్‌నగర్ నుంచి కొందుర్గు వైపు వస్తున్న లారీ బొలెరో వాహనాన్ని ఢీ కొట్టడంతో బొలెరో, లారీ ధ్వంసమయ్యాయన్నారు. బొలెరో డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.